# విశాలాంధ్రా: మరదలు పిల్లా

కథానిక

వి. ఎస్. కల్యాణి

ఈ మధ్య నేవో సెలవలు వస్తే ఖమ్మంలో స్నేహితులతో పనుండి వెళ్ళాను. అంతవరకూ వెళ్ళేక మా విశాలక్కయ్యని చూడకుండా తిరిగి పోవటం ఏమిటనిపించింది. తిరిగి వచ్చి చూసుకో వలసిన అర్జంటు పనులు వెనుక మారాం చేస్తూన్నా అక్కయ్యని చూడాలనే ఆపేక్ష బలవత్తరంగా వుండటం మూలాన్న సరాసరి ఎగువకెళ్ళే ఎక్స్‌ప్రెస్ అందుకున్నాను.

అక్కయ్య అంత మొహంచేసుకుని ఆదరించింది. అక్కయ్యమీద నాకో గట్టి అభిప్రాయం వుంది. కల్మషంలేని హృదయం అక్కయ్యది. బావా మంచివాడే. మాటకారి. 'నా వాళ్లు' అన్న బంధుభావం కలవాడు. ఎటొచ్చీ కాస్త కోపిష్టనీ మొండివాడనీ చెప్పగా విన్నాను. కాని అట్టే అనుభవం లేదు. ఎవరేనా బావనేదైనా చిన్నమాటంటే అక్కయ్య సహించలేదు. అమాయికురాలు లొంగివుండడం నేర్చుకున్నది అట్టే యిబ్బంది లేదు. అనుకుంటూండే దాన్ని; అది కేవలం ఎవరితోనూ వెల్లడించని నా లోలోపలి స్వంత అభిప్రాయం అనుకోండి.

ఆ రాత్రి పదకొండు దాటే వరకూ కూడా ఏవో పిచ్చాపాటీ మాట్లాడుకోవడంలో గడిచిపోయింది. మాటలసందర్భంలో తెలిసింది కాస్త మా బావకూడా ఈ మధ్యను 'విశాలాంధ్ర–తెలంగాణా సమస్యల్లో ఉద్రేకపడుతూన్నట్టు. బావను కవ్వించటం నాకు సరదా. ఎలా ఉద్రేకపడతాడో నేనూ చూసి ఆనందించాలనుకున్నాను. బావన్నాడు, "మీలాంటి చదువుకున్న అమ్మాయిలు ఏం చేస్తూన్నట్టూ...గోడమీద పిల్లి వాటం కాదు కదా!" అన్నాడు నవ్వుతూనూ. వ్యక్తిగతమైన పట్టుదలలేమీ యీ విషయంలో ప్రత్యేకించి నాకులేవు. చూసి ఆలోచించి, ఆచరించగల పెద్దలూ, పెద్ద పెద్దలూ ఎలాగూవున్నారు. మన అభిప్రాయాలకి విలువ వుంటుందని నా మట్టుకు నేననుకోను. అంచేత నాకో అభిప్రాయం అంటూ ఏర్పరచుకోలేదు. ఐనా బావను కవ్వించటమే నా ప్రథమాశయం. నేనూరుకోలేదు.

"గోడమీద పిల్లి వాటానికి మాకేం కర్మకాలిందయ్యా! అది రాజకీయ నాయకులకు కాని! పక్కా తెలంగాణావాదులం... మీలాంటి ఉద్రేకపడే వారితో మాకేంపనయ్యా సంబంధం, లేనిపోని గొడవ!' అన్నాను.

"ఓహో తెలంగాణా వాదులా! అయితే జాగ్రత్తగానే వుండాలి. హస్తలాఘవం కూడా కనపరచగలరేమో... పెద్ద వెరకేసుకొస్తున్నావే... కాని తిండికూడా మామీద ఆధారపడాలోయ్ మీ తెలంగాణా వాదులూ!" అన్నాడు బావ.

"మా 'తెలంగాణ కోటిరతనాల వీణ' మాకేమయ్యా" అన్నా నేను.

"పదగుంభనం ఎరువు తెచ్చుకొన్న సరుకులాగ బాగావుందిలేగాని, ఆ 'వీణ'ని ప్రయోగించిన మనిషి విశాలాంధ్రుడే నమ్మావ్!... ఆయన 'మహేంద్రోదయం' చదవలేదూ!" అన్నాడు. నాలో లోపాన్ని బావ చూపించటం నా కిష్టం లేకపోయింది. "పోనీలెద్దూ ... ఆ మా టెవరు

వాడిలేనేంగాని నా సందర్భంకోసం నే వాడుకున్నానంతే!"

ఇలా ప్రారంభమైన వాగ్వాదం మెట్టుమీద మెట్టు పైకి వెళ్ళిపోయింది. 'మీది సంకుచితత్వం' అన్నాడు బావ. 'మీది ఖర్చులు తగ్గుతాయనే ఆశ!' అన్నా నేను. ఎటు వాదించాలన్నా ఏవో కొన్ని ఎవర్ రెడీ పాయింట్లు రాజకీయనాయకులు తయారుచేసే వుంచారు- అవే పట్టుకుని అటూ యిటూ సాగదీయటమే తరువాయి. అదే జరిగింది. బావ ఉద్రేకాన్ని కళ్ళారా చూశాను. అతను కాస్సేపు మౌనంగా కూర్చుండి పోయాడు. నేనో మాట ఘాటుగా అనేసి (ఆ మాటసంగతెందుకులెండి) అక్కయ్య ముఖం చూశాను విజయగర్వంతో. అంతవరకూ మౌనంగావున్న అక్కయ్య ఒక్కసారి లేచింది.

"అబ్బ ఊరుకుందురూ మీగోల కల్యాణీ ఏదో మహానాయకురాలైనట్లు మాట్లాడుతావే. ఒక్క అభిప్రాయంపట్లా 'సీరియస్‌నెస్' వుండా నీలో! ఇంతకూ అటు తెలంగాణా అయినా యిటు విశాలాంధ్ర అయినా మీ సొమ్మేదో పోయినట్టు రెచ్చిపోతారేం!... ఈ మామూలు ప్రజలందరూ తమ ఉద్దేశా లేవి కానీండి వాటి కిట్టైతే లాభాలు గుమ్మరించి దిగబోసుకుంటూన్నట్టూ, అట్టైతే ఉన్నదేదో ఊడ్చిపెట్టుకు పోతూన్నట్టు తమకు తమే ఊహించుకుని ఉద్రేకం పడటం వల్లనే ననుకుంటాను ఈ రాద్ధాంత సిద్ధాంతాలన్నీను... అబ్బబ్బబ్బా... అందరూ అనుకుంటారు తమకు తామే రాజకీయనాయకులని! అవతల ఏదిమంచిదో ఆలోచించి చేయగల పెద్దపెద్దలందరూ వున్నాక ఈ చిన్నలందరికీ యింతంత ఉద్రేకాలెందుకో నాకర్థంకాదు. విశాలాంధ్రైతే మీ బావ ముఖ్యమంత్రీ కారు. తెలంగాణావస్తే నువ్వు గవర్నరూ కావు. ఎవరిమాట వాళ్ళు పట్టుకుని ఊగులాడ్డమే కదూ రాజకీయాలంటే. వీరిమాట వారు వినరు. వారి మాట వీరికర్థంకాదు. ఊరుకుందురూ ఎందుకొచ్చినగొడవ. పన్నెండవుతూంది కాబోలు మహామహులు ఎనిమిది వరకూ పడుకుంటారు మీకేం!

అక్కయ్య ఉపన్యాసం నాకు నచ్చింది. ఆ ఉద్రేకపడటాలూ అవీ బావకుగాని నాకు కావుగా మరి. బావసంగతెరుగున్నది కాబట్టి అక్కడితో ఓ రూలింగ్ ఆర్డరిచ్చేసిందనుకున్నాను.

"డెమోక్రసీ అంటే అర్థం తెలిసేడుస్తేగామరి! ప్రజలలో ప్రతి ఒక్కడి అభిప్రాయానికీ విలువ ఉన్నదే ప్రజాప్రభుత్వం. ప్రభుత్వ యంత్రాంగంలో ప్రతిఒక్కడూ భాగస్వామి కావాలి" బావన్నాడు.

"అయితే ఉద్రేకాలతో మాటలతోనూ, చేతలతోనూ ఒకర్నొకరు కొట్టుకోటమే 'సిటిజన్‌షిప్' అంటావ్...అంతేనా బావగారూ!" అన్నా నేను.

బావ మాట్లాడలేదు. "అబ్బా మీరే దేశాన్ని పాలించేస్తున్నట్టు మాట్లాడేస్తారండీ. ఈమాత్రం ఉద్రేకాలు దాచుకోలేనివాళ్ళు దేశం పాలిస్తే మనపని ఒక్క రోజులో బూడిదే" అంది అక్కయ్య. బావ తేలికగా నవ్వేడు.

మర్నాడుదయం లేస్తూనే బావ శాపనార్థాలతో దినచర్య ప్రారంభించాడు. ఏదో అక్కయ్య చేతినుంచి జారి కిందపడి చప్పుడయింది.

"ఏమిటా వెధవచప్పుడూ! ఇంట్లో సరుకుల్ని వుండనిచ్చేట్టు లేవాయేం?" అంటూ కప్పుకున్న దుప్పటీ విసిరికొట్టి లేచివచ్చాడు బావ.

"వెధవది చేతినుంచి అమాంతం తిరగబడిపోయిందండీ." అక్కయ్య నవ్వుతూనే చెప్పింది.

"తిరగబడి పోతుంది. చేతినరాల్లో పటుత్వం తప్పిపోతూవుందా? తిన్నతిండి ఏమైపోతూందో!" అంటూనే అతను దొడ్డివైపు దారితీశాడు. అక్కయ్య మౌనంగానే వుండిపోయింది. నాక్కొంచెం పౌరుషం వచ్చింది. ప్రమాదం అన్నదెవరికేనా వుంటుంది. అంత దాని కిన్నిమాటలెందుకూ? అంత అథారిటీ ఏమిటా అని!—

అక్కయ్య కాఫీ నీళ్ళు దింపుతూంది.

"మరీ అంత అథారిటీ యెందుకే మొగాళ్ళకి?" అన్నాను.

అక్కయ్య నవ్వింది. ఆ నవ్వులో కోపం లేకపోవటం నా కాశ్చర్యం కలిగించింది. "ఏమనుకున్నావేమరీ! మగాడన్న పదంలోనే వుంది అహంకారమంతాను. మళ్ళీ తనకే ఎందుకైనా కోపం వచ్చిందంటే చూడాలి తమాషా! దారిలో ఏ వస్తువున్నా తుక్కుతుక్కు కావలసిందే. ఇంకోళ్ళ

తప్పైతే ఎక్కడలేని జాగ్రతా!" విశాలక్కయ్య నవ్వుతూనే అన్నది.

"పాపం! నీకు నవ్వుతాలుగానే వున్నట్టుందే" అన్నాను కొంచెం ఎగతాళిగా.

"మరేం చెయ్యమంటావే? నవ్వుతాలనుకుంటే మాత్రం మన కొచ్చిన నష్టం లేదు కదే!"

"అవునులే. అంతేమరి!" అనుకొన్నాను నేను.

ముఖం కడుక్కునివచ్చి తువాలు తీసి కొంటూ "ఏం ఇదింత నల్లగావుందేం!" అన్నాడు బావ చీదరగా—అదేదో మా అక్కయ్య మహాప రాధమైనట్టు! నాకు నవ్వొచ్చింది.

"మాసిపోయినట్టుంది. మరోటిస్తాను లెద్దురూ. ఆదక్కడుంచండి" అంది అక్కయ్య శాంతంగా కాఫీ తిరగబోస్తూ.

"ఏం ఇంకోటెందుకు తియ్యాలి. ఇదెందు కుతికించలేదూ? పనిమనిషి వున్నది నీ బట్టలకిగాని నా తువాళ్ళకి కాదా? ఉండు బద్ధకం మరీ ఎక్కువై పోతూంది. పనిమనిషిని ఒదిలించి చూస్తాను"—బావ యింకా ఏదో అంటూనే వున్నాడు. నా కసహ్యం వేస్తూంది ఓమూల.

అక్కయ్య వేడికాఫీ కాలిమీద ఒలకపోసు కుంది కంగారులో. నేను కలగజేసుకుంటే అతనికేం కోపం వస్తుందోనని ఊరుకోవలసి వచ్చింది. అక్కయ్య ముఖంచూచి ముఖం చిట్లించాను కోపంతో. 'ఊరుకో' అన్నట్టు చూసింది.

కాఫీయిస్తే ఇదేమిటింత వేడిగావుందనోమాటు, చేదుగావుందని మరోసారి హడావుడిచేసి యిచ్చిన అరగంటకి తాగేడు. మాట్లాడకుండా కూర్చు న్నాడు గదిలో. అక్కయ్య వంటపనిలో పడింది. నే నాలోచనలో పడ్డాను. రాత్రి ప్రజాప్రభుత్వం, విధులూ అంటూ అంత బాధ్యతాయుతంగానూ మాట్లాడినది యీ విశాలహృదయుడేనా అని!

తమదాకావచ్చేదాకా అందరూ పెద్దమనుషులే.

"నా బనీనుతికించావే!"బావ దిగాడు.అక్కయ్య కళ్ళింత పెద్దవిచేసి పెదవికరుచుకుంది. తెలుస్తూనే వుంది వాలకంనుంచి మరిచిపోయినట్టు. సమాధానం చెప్పలేదు. "ఏం మాట్లాడవేం!" గద్దించాడు.

"మరిచిపోయానండి. ఇవాళ తప్పకుండా ఉతికిస్తాగా. వెధవది ఏదో ధోరణిలో పడిపోతే ఏదీ గుర్తుండదు."

"ఊఁ...మరిచిపోయావేం? అరవైయేళ్ళ ముస లమ్మవి కావుగా మరిచిపోడానికి! అవును నువ్వెందు కుతికిస్తావు. నువ్వనుకున్నా నీ పనిమనిషి ఉతకదుగా! అది నీ చాకిరీ చెయ్యడానికి పెట్టుకున్నావు. నా పనెవరికి కావాలి. అసలు చెప్పడమే పొరపాటయి పోయింది."

బావ బనీను తువ్వాలూ దండెంమీదనుంచి లాగేసి బక్కెట్లోవేసి సబ్బుబిళ్ళ పట్టుకునివెళ్ళాడు.

"అబ్బ...ఒక్కరోజులో మునిగిపోయిందేం టండీ? అలా వుంచండి. ఇవాళ పనిమనిషిచేత ఉతి కిస్తానంటున్నా కదూ." అక్కయ్య అడ్డంవెళ్ళింది.

"ఏమ్...నువ్వు నా కడ్డం రానక్కర్లేదు. నా పని నే చేసుకోగలను. ఇంకా అంతమాత్రం శక్తి వుందీ శరీరంలో."

అక్కయ్య మాట్లాడకుండా నిలబడింది.

"పోనీ నేనుతుకుతాలెద్దూ. అలావదిలి వెళ్లు బావా" అన్నాను లోపల కోపంగా వున్నా ఊరుకుంటే బాగుండదని.

"నువ్వూరుకో" అన్నట్టు సంజ్ఞ చేసింది అక్కయ్య.

"ఉట్టి పుణ్యాన యింత రాద్ధాంతం చేశాడు. కావలసిందే శాస్తి ఉతుక్కోనీ!" అనుకున్నాను.

ఆ తరువాత బావ మాట్లాడలేదు. నేనూ ఏదో పుస్తకం చూస్తూ వుండిపోయాను.

తొమ్మిదైంది. ఆఫీసు వేళవుతూ వుంది. అక్కయ్య భోజనానికి లెమ్మంది. బావ కదల్లేదు. కాస్సేపయాక మళ్ళీ పిలిచింది "ఆఫీసుమాట మరిచి పోయినట్టున్నారే. ఇంకోరోజైతే ఈపాటికి నా ప్రాణం తీసెయ్యరూ ముందు కంచంలోపెట్టమని!" అంటూను.

"పోనీ ఆట్టే కంఠం చించుకోకు మరచిపోతే మరిచిపోయాను. నా ఆఫీసు కాని నీది కాదుగా నా తొందరతో రోజూ నీ ప్రాణం పోతూందిగా. ఇవాళ బ్రతుకు!"

"అబ్బబ్బా! మీతో ఏమన్నా గొడవేనండీ. మీ కాలస్యం అవుతే నష్టమేమో నను కోవడం కూడా తప్పేనన్నమాట! పోనీలెండి. కంచంలో అన్నం చల్లారి పోతుంది నామీద కోపగిస్తే."

"పోనీ చల్లారిపోతే. యిష్టంవుంటే తింటాను, కష్టమైతే మానేస్తాను. నీకేమైనా నష్టమా?"

మాట్లాడ కూరుకోక ఈ బ్రతిమిలాడడం ఏందుకూ అక్కయ్యమాత్రం? తిక్కమనిషి వెడితే వెడతాడు భోంచేయకుండా. తెలిసొస్తుంది... అక్కయ్య నివతలకు పిలిచి అన్నాను: "మరీ అంత బ్రతిమిలాడే పనేమిటి" అని.

అక్కయ్య నవ్వింది, "అమ్మాయ్ నీకు తెలియదే, నువ్వూరుకో"అని. నాకు రోషం వచ్చింది. ఐనా ఏంచెయ్యను, అక్కయ్య శుద్ధ తెలివితక్కువదనుకున్నాను.

భోజనానికొచ్చినవాడికి ఆ తినే కాసేపైనా శాంతంలేదే! "కాస్త కూర వెయ్యనా?" అంటుంది అక్కయ్య. పుల్లవిరిచినట్టు, చెంప చరిచినట్టూ సమాధానం 'అక్కర్లేద'ని.

"కాస్త అన్నంవెయ్యనా?"పోనీ అక్కయ్యైనా ఊరుకోదే!

"కావలిస్తే వేసుకుంటాను."

అవతల కూర్చున్న నాకు ఒళ్ళంతా మండుకొస్తోంది. "ఇవాళెవరి ముఖం చూస్తూ లేచారు మహాశయా? బహుశా నా ముఖమే కాబోలు!" అక్కయ్య.

"నీ ముఖంకాదు, నీ విరగబాటు! కాసేపు సైలెంట్‌గా ఊరుకోలేవా అని. భోజనంచేసేప్పుడు కూడా లేదు శాంతి."

"అందుక్కూడా నేనే కారణమా! ఎందుకుండక పోవాలీ శాంతి? అనవసరంగా నామీద కోపగిస్తే భోజనం సహించదు కూడానూ...అపైన మీకే నష్టం."

అక్కయ్య మాటలు అసభ్యంగా కనిపించాయి నాకు. మండేవాడిని మండనీయక మధ్యని అడ్డపుల్లలెందుకూ? 'ఇరిటేట్'చెయ్యడం కాదూ?

"హ...నువ్వా సంగతి చెప్పక్కర్లేదు. ఇహ నోటికి తాళం పడదా ఎప్పటికీనూ?..." బావ అక్కయ్యవంక తీక్షణంగా చూశాడు. నాకు ముళ్ళమీద నుంచున్నట్టు అనిపించింది.

తమలపాకులు కట్టతూంటే అవసరం లేదన్నాడు.

"నోరూరుకోనివ్వదండీ అనవసరంగా నామీద కోపగిస్తే..." అక్కయ్య అంటూనేవుంది, బావ కోటువేసుకుని విసురుగా వెళ్ళిపోయాడు వీధిలోకి.

నా కోపం అంతా ఒక్కసారి బైటికివచ్చింది.

"మరీ నీదేదో మునిగిపోయినట్టు ప్రవర్తిస్తావేమే మాట్లాడకుండా ఊరుకుంటేసరిపోదూ!"అన్నాను.

"నీకు తెలియదు కల్యాణీ! మనుష్యుల్నిబట్టి మసులుకోవాలి"అన్నది అక్కయ్య.

"నేనూ అదే అంటున్నది. మనుషుల్నిబట్టి ప్రవర్తించటమే కాబోలు యిదంతా?" అన్నాను. అక్కయ్య సమాధానం చెప్పలేదు.

"అక్కయ్యా! నువ్వు వెయ్యిచెప్పు, నూరు చెప్పు, నువ్వాతనితో అన్ని మాటలు మాట్లాడడం తెలివితక్కువతనం. చూసేవాళ్ళ కేమనిపిస్తుందంటావ్, అతనికి కోపంవస్తే కొంప మునుగుతుందని నువ్వు భయపడిపోయేటట్టు. బొత్తిగా 'కామన్ సెన్స్'ఉండొద్దే బావకు! తిక్కమనిషిని తిక్కకుదిరేదాకా వదిలెయ్యాలి. దిమ్మతిరుగుతుంది"అన్నాను.

అక్కయ్య ముఖం గంభీరంగాపెట్టింది.

"మనిషి మనసును సాధించటంలోని పద్ధతది కాదు."

నాకు నవ్వొచ్చింది. "ఈ విధంగా నువ్వు చాలా సాధించావ్. అవునా?" అన్నాను హేళనగా. అక్కయ్య ఆలోచిస్తూంది.

"భోజనానికి పిలిస్తే కూడానా! అసలు రెండోసారి పిలవకుండా వుండాలి. నేనైతేనా—"

"పెద్ద చదువులు చదువుకున్న పిల్లలకదేనే అహంకారం" అందక్కయ్య నవ్వుతూ తాపీగా. "ఎవరో ఒకరు సర్దుకోకపోతే సంసారాలెలా నడవటం?"

"ఒకళ్ళనొకళ్ళర్థంచేసుకుని నడిపించాలి. ఆడదంటే అంత అలుసేం?"

"అవును ఇద్దరూ బుద్ధిమంతులయితే యిబ్బందేలేదు. ఒకరు మతిమీరుతున్నారని రెండోవారు కూడా—ఇంతకీ యిటువంటి సిద్ధాంతాలెక్కువైతేనే చదువుకున్న భార్యాభర్తలలో అపార్థాలు, పొరపులూ రావటం."

"అంటే భార్య లొంగి అణగిమణిగి వుండాలంటావ్!"

"కల్యాణీ! ఒకటి చెప్తాను వింటావా" అంది అక్కయ్య.

'ఏంచెప్తుందేం'మా గొప్ప అన్నట్టుగాచూశాను.

"మగవాళ్ళలో నిరంకుశత్వం ఉందనే అను. తరతరాల మొగతనానికి వారసత్వంగా వచ్చిన ఈ గుణం, ఈ వాళ మనం తెలివి తెచ్చుకున్నా మనిపోవటం లేదు అవునంటావా?" అంది. నేను మాట్లాడలేదు.

"కాస్త కారణం కనిపిస్తే కొండంత చేస్తారనుకో. అది మనిషి తత్వాన్నిబట్టికూడా వుంటుంది. అదైనా కాసేపు. ఆ కాసేపూ కొంత ఓర్పూ, శాంతం మనం చూపించినంత మాత్రాన మన ఆత్మాభిమానానికి లోటుంటుందని నేననుకోను. మీ బావనివాళ చూస్తున్నావు. నా కలవాటే మరి. భోజనానికి రమ్మంటే రానన్నారని ఊరుకుంటానే అనుకో. ఆఫీసువేళవరకూ కూర్చుని వేషం వేసి లేచిపోతారు. ఆ సమయానికి మనం తిరిగి సాగదీసినా లోపం మనదగ్గరే వుంటుంది. ఇంట్లో అభిమానపడి ఏం బావుకోగలం? కులాసాగా ఉండగలమా? భోజనం చేయకుండా ఆఫీసుకెళ్ళిన ఆయ నేమనుకోవాలి? దీనికి ఎంత నిర్లక్ష్యం?—అనే కదా! అది మరి కడుపులో అసలు ఉక్రోషానికి మరింత దోహదం..."

అక్కయ్య 'ఆర్గ్యూ' చేస్తూంది.

"ఇలాంటి ప్రవర్తన 'మానర్సు' తెలియకపోవటం వల్లనే. అటువంటివారికి మనం యిలా సరిపెట్టుకొని ఊరుకుంటే మన సద్గుణం మెప్పు పొందలేదు సరికదా! 'మనం ఏదంటే అది పడివుంటుంది కదా!' అన్న భావం ప్రబలం అవుతుందంటాను. ఆ గుణాన్ని అణచిపెట్టాలి" అన్నాను.

"ఈ ప్రవర్తనవల్ల ఆ గుణాన్ని అణచివెయ్యలేం సరికదా, ద్వేషానికి మరింత దోహదం చేస్తామేమోనని నా భావం."

విశాలక్కయ్య నివ్వింది. నన్ను కించపరచినట్టనిపించింది.

"కేవలం ఒకరు ప్రయత్నించి ఎవర్నీ మార్చలేరు కల్యాణీ! మనిషి మనస్సు మారాలి. ఎంత మంచివాళ్లైనా కానీ... కొన్ని కొన్ని సమయాలుంటాయనుకుంటాను. అప్పుడు కేవలం అధమంగా ప్రవర్తిస్తారు. నిజంగా అప్పుడప్పుడు మీ బావగారి ఈ ప్రవర్తన నైతికంగా పతనంగా కనిపిస్తుంది. విన్నవారూ చూస్తూన్నవారూ మనిషి నేవిధంగా లెక్కకడతారంటావు! ఈ పతనానికి నాకు కలిగేది జాలీ, విచారమూ కాని కోపం కాదు కల్యాణీ కక్షకట్టేందుకు!"

నేను వింటున్నాను. అంతంత పెద్ద మాటలు అక్కయ్య మాట్లాడుతుందనుకోలేదు.

"ఈరకం మనుష్యులు ఈ నిముషం ఈవిధంగా ప్రవర్తిస్తారే అను. ఉద్రేకంలో ఏదో అంటారు. అన్నంతసేపు పట్టదు. తామన్న మాటలమీదా, ప్రవర్తనమీదా తమకే అసహ్యం కలుగుతుంది. కాని ఏవిధంగా తిరిగి సరిపుచ్చుకోవాలో తెలియదు. ఆ సరిపుచ్చుకోవటంలో తన అధికారానికేం భంగమో అనేదో శంక."

"బావ బతికిపోయాడులే నీలాంటి పెళ్ళాం దొరకడంవల్ల" అన్నాను ఏమీ తోచక.

"వారనుకోరలాగ కల్యాణీ! అక్కడేవుంది తమాషా!" అక్కయ్య ఉత్సాహానికి కారణం కనిపించలేదు నాకు.

"ఏమనుకుంటాడు?" అన్నాను.

"శిక్షిస్తున్నట్టు! నా ప్రవర్తన తనకో శిక్ష అని!" నే నులికిపడ్డాను. అణిగిమణిగి ఉండడాన్ని 'శిక్ష' అని నిర్వచించటం అంతకుముందు నేను వినలేదు. అదే అన్నాను.

"మనిషికి యింగితజ్ఞానం సహజంగా వుంటుంది. అప్పుడప్పుడు దానిని లెక్కపెట్టకుండా చేస్తూంటారు పనులు తర్వాత వాళ్ళకే తెలుస్తుంది. ఎంత ఉద్రేకంతో మాటలంటారో, పనులు చేస్తారో మనసంతగానూ తర్కించుకుంటుంది. తమ మనసే తమకు భిన్నమైన విధంగా నిర్ణయాలు చేసినప్పుడు మనిషి సహించలేదు. అందుకు కారణమైన వారిని తాత్కాలికంగా ద్వేషిస్తాడు. తమ తప్పును ఒప్పుకోలేక ఏదో విధంగా సమర్థించుకోచూస్తాడు. ఎన్నో అవకతవకలు తనకే కనిపిస్తాయి. ఎదుటివారు ఎంత సబబుగా వర్తిస్తే, ఎంత ఓర్పును చూపిస్తే అంతగానూ కనిపిస్తాయి. తామేదో లొంగిపోతున్నామనే విషయం ఇతరులకి, ఎదుటివాళ్ళకి తెలియకూడదు! ఆ భావమే కస్సుబుస్సుమనిపిస్తుంది. తాము మెత్తబడినట్లు కనిపించకుండా వుండాలి. పరిస్థితులు చక్కబడాలి. ఎలాగ మరి? మనిషి భావోద్రేకాలమీదా, అభిమానాలమీదా జాలి చూపాల్సిన పరిస్థితది."

నేనెందుకో నవ్వుతున్నాను. అక్క ఆర్గ్యుమెంటుకని చెప్పలేను. ఎందుకో స్పష్టంగా నాకే తెలియదు.

"నువ్వు పెద్దచదువులు చదివేవు. ఒకవేళ నా మాటలు నవ్వొస్తాయికాబోలు, అది నా అభిప్రాయం సుమా!" అంది

"సైకాలజీ చదివినట్టు చెప్పేవే అక్కయ్యా!" అన్నాను.

"పెద్దచదువులు చదువుకున్న వాళ్ళబుద్ధే అది. జీవితానికి సంబంధించిన విషయం ప్రతీదీ పుస్తకాల్లోనే వుంటుందనుకుంటారు. మనుషుల్ని గురించి తెలుసుకోడానికి పుస్తకాలు చదవక్కర్లేదే... సానుభూతి కావాలి" అంది.

నేనూరుకున్నాను.

సాయంత్రం తిరిగి 'విశాలాంధ్ర' అంటూ బావ నాతో కులాసాగానే మాట్లాడేడు. అక్కయ్య కాఫీతో వచ్చింది. బావ మౌనంగాఊరుకున్నాడు.

"నేనున్నాననా ఒక్కసా రాగిపోయారు? మాట్లాడుకోండి మహాశయా...నాకూ పనివుంది!" అంటూ అక్కయ్య వెళ్ళిపోయింది. తాగుతున్న కాఫీ గ్లాసులో ఒకసారి నా ప్రతిబింబం చూసుకున్నాను.

పక్కనక్కయ్య నవ్వింది నిరామయంగా.

మర్నాడు సాయంత్రం నా ప్రయాణం పెట్టుకున్నాను. అక్కయ్య పని కట్టుకుని బావను బజారుకు పంపించి లేత బీరకాయలు రెండు వీశెలూ, రెండు లేత సొరకాయలూ, వీశెడు సీటొంకాయలూ తెప్పించి ఓ బుట్టలో పెట్టించి 'పాక్' చేయించింది.

"నాన్నగారి కివంటే ఎంతిష్టమనీ! లేత సరుకు దొరకడమే బ్రహ్మాండం అక్కడ" అంది తృప్తిగా.

"మహా పట్నంలో లేతసరుకే దొరకదంటుందక్కయ్య" అన్నాను.

"పట్నమైతేనేమే అసలు పట్నంగాబట్టే ఏ సరుకైనా చలామణీ అవుతుందనుకుంటారు వర్తకులు" అంది. "సీటొంకాయ మచ్చుకి కనిపిస్తుందా చెప్పు. పట్నం అంటావు ఏమిటో..."

తీసికెళ్ళవలసిన బరువును గురించి ఆలోచిస్తున్నాను నేను.

సాయంకాలం స్టేషన్‌కి అక్కా బావా యిద్దరూ వచ్చారు. అరగంటకి బండివచ్చింది. సామాను సర్ది కిందకు దిగాను. ఓ పావుగంట టైముంది 'స్టార్ట్' కావడానికి.

"ఉత్తరాలు రాస్తూండవే బొత్తిగా మానేశావ్, అంత చదువులు శ్రద్ధగా ఏం చదవగలవో గాని" అప్పటి కక్కయ్యామాట చాలాసారులు చెప్పింది.

"మరదలు పిల్లకి మన మెందుకే! మనం ఆంధ్రులం కాదూ....తను తెలుగుపిల్ల ఐపోయింది!" బావ నవ్వేడు. నేనూ నవ్వేను.

"అమ్మనీ నాన్ననీ చాలా చాలా అడిగానని చెప్పు. బాబిగాడికి నా ముద్దులని చెప్పు..." అక్కయ్య యింకా ఎవరెవరికేం చెప్పమంటుందో కుతూహలంగా వింటున్నాను.

"సరేలే మరదలుపిల్లా! మీదొడ్లో ఆవుదూడకి నా 'హార్టీకిసెస్' అని చెప్పు. మరిచిపోకూడదు సుమా" అన్నాడు బావ. నాకు నవ్వాగలేదు.

"బావగారిలో యింత 'హ్యూమరుం'టుందనుకోలేదు!" అన్నాను.

"ఆంధ్రుల చరితం, అతిరసభరితం! మరేమనుకున్నావ్!" అక్కయ్య కిలకిలా నవ్వింది.

"అంతేలే అక్కయ్యా బాగాచెప్పేవు. అతిరసం నీరసం! అంతేకదూ!" నువ్వేను.

ట్రైనుకి సిగ్నలైంది. ఎక్కి కూర్చున్నాను. 'జై విశాలాంధ్ర' అన్నాడు బావ. నన్నేదో ఉడికించాలని బావ తాపత్రయం.

"ఎందుకు బావా అంత ఉద్రేకాలు కలవాడివి, కోపిష్టివి మా తెలంగాణా నీ చేతుల్లో పెట్టడం."

"మాలో మేం కీచులాడుకున్నా చుట్టాలకు లోటు చేయం కదే" అక్కయ్యంది.

తిరిగి నేనోక్షణం ఆలోచించవలసి వచ్చింది.

"మీ అక్కయ్యనుకుంటున్నావ్ పాపం మా ఆవిడ! తెలుసా!" అన్నాడు బావ. "అక్కయ్యనయ్యాకే ఆవిడ నండోయ్" అంది విశాలక్కయ్య. ట్రైన్ కదిలింది.

"వెళ్ళొస్తా" నన్నాను. 'వచ్చేదెప్పుడో ఓకార్డు ముక్క వ్రాయి' అన్నాడు బావ.

"అమ్మనూ నాన్ననూ అడిగానని చెప్పు" అంది అక్కయ్య. చివరిసారిగా జేబు రుమాలాడించాను. బండి దృష్టిపథంనుంచి తప్పేవరకూ అక్కడే నిలబడివున్నారిద్దరూ.

అక్కయ్యమీద నా అభిప్రాయాన్ని మార్చుకున్నాను. ★